
సాక్షి
బాపట్ల
మంగళవారం । 8 । జూలై । 2025



నేటి నుంచి శాకంబరి ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం కానున్నాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 529.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎడమ కాలువకు 3,374 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 10న పర్యటించనున్నారు. పర్యటన ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ సోమవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

మద్యం సీసాలు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్

బలిజేపల్లి(వేమూరు): 'కిరాణా షాపులో మద్యం బెల్టు షాపు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ సీఐ రవి కుమార్ స్పందించారు. వేమూరు మండలం బలిజేపల్లిలో అనుమానిత ప్రాంతాలలో దాడులు చేసి ఒకరి వద్ద అక్రమంగా ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషనులో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని, వారిపై కూడా దాడులు చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

అలసట, నిద్రమత్తు ప్రమాదకరం



బాపట్ల: పోలీస్ విధులలో డ్రైవర్ బాధ్యత కీలకమైనదని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీస్ వాహన డ్రైవర్లకు నిర్వహించే 'డ్రైవర్ ప్రొఫిషియెన్సీ స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ క్యాప్సూల్ కోర్స్'ను సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ ప్రారంభించారు. శిక్షణలో భాగంగా ప్రదర్శించిన వాహన విడి భాగాలను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ అధునాతన డ్రైవింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ప్రమాద నివారణ సాంకేతికతలు, వాహనాల నిర్వహణ, వీవీఐపీ కాన్వాయ్ ప్రొటోకాల్స్ పాటించడం తెలుసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులలో డ్రైవర్లు మరింత భద్రంగా, వృత్తిపరమైన పరిపక్వతతో విధులు నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ కోర్సు ద్వారా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. జూలై 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజులపాటు పోలీస్ డ్రైవర్లకు ఈ కోర్సు నిర్వహిస్తారని తెలిపారు. సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి, ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రధానంగా మానవ తప్పిదాలు, వాహన నిర్వహణ లోపాల వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాహనాల పనితీరు, బ్రేక్‌లు, టైర్లు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి డ్రైవర్ తన వాహనం పరిస్థితిని సరిగ్గా తెలుసుకొని, వాహనం ఎంత వేగంలో నడపాలో స్పష్టంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాన్ని ఎక్కువసేపు నడపడం వలన అలసట కలగవచ్చని, నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉంటుందని, ఆ సమయంలో తక్షణం విశ్రాంతి తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు మనం పాటించినా, ఎదుటివారు పాటించకపోతే ప్రమాదాలు జరగవచ్చని, అందువల్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలను అంకితభావంతో ఆచరించాలని సూచించారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, బాపట్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భాను వెంకటరంగారావు, ఎంటీ ఆర్ఐ శ్రీకాంత్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులతో పాటు ఉప విద్యాశాఖాధికారుల ద్వారా ఈనెల 13వ తేదీలోపు https://nationalawardstoteachers.education.gov.in సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు వెలువరించారు. 2014లో పొన్నూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసులో 32 సంవత్సరాల మద్దసాని సురేంద్ర 13 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొన్నూరు పోలీసులు కేసు నమోదుచేసి కోర్టులో సమర్పించారు. కేసులో నేరం రుజువు కావడంపై ముద్దాయికి జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి నష్టపరిహారం కింద ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు చెల్లించేలా తీర్పు చెప్పారు. ముద్దాయిని జిల్లా జైలుకు తరలించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బరత్ అలీఖాన్ వాదనలు వినిపించారు.

మనసున్న మారాజన్న



- దివంగత వైఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి
- ఆరోగ్యశ్రీతో పేదలకు వైద్యం
- ఫీజు రీయింబర్స్‌తో పేద, మధ్యతరగతి వారికి ఉన్నత చదువులు
- తీరప్రాంత రైతులకు ఉచిత విద్యుత్
- కో ఆపరేటివ్‌లోకి జంపని షుగర్ ఫ్యాక్టరీ
- నిజాంపట్నంలో సునామీ బాధితులకు పక్కా గృహాలు
- విజయవాడ నుంచి రేపల్లె వరకు కృష్ణా కరకట్ట నిర్మాణం
- అద్దంకిలో జలయజ్ఞం కింద మూడు సాగునీటి పథకాలు
- రూ.1100 కోట్లతో మేదరమెట్ల-నార్కెట్‌పల్లి రహదారి
- దివంగత నేతను కొనియాడుతున్న జిల్లా వాసులు
- ఆయన దారిలోనే కుమారుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- నేడు జిల్లాలో ఘనంగా దివంగత నేత వైఎస్సార్ జయంతి వేడుకలు



నిజాంపట్నంలో జననేత వైఎస్ రాజశేఖరరెడ్డికి పూలవర్షం కురిపిస్తూ ప్రజలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఫీజు రీయింబర్స్‌తో పేద, మధ్యతరగతి ప్రజల బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. ఆరోగ్యశ్రీతో పేదలకు ఉచిత వైద్యం అధించాడు. లక్షల్లో ఖర్చయ్యే గుండె ఆపరేషన్లను సైతం రూపాయి ఖర్చులేకుండా చేశారు. జలయజ్ఞంతో సాగునీటి పథకాలు తెచ్చారు. ఉచిత విద్యుత్ అందించి అన్నదాతలకు వ్యవసాయాన్ని మరింత చేరువచేశారు. ఒకటా రెండా వందలాది సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు ఉరికించారు. జనం గుండెల్లో దేవుడిలా గుడికట్టుకున్నారు. ప్రత్యర్థులు సైతం శభాష్ అనిపించేలా పాలన సాగించారు. ఆయనే దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి. ఆయన పాలనలో బాపట్ల ప్రాంత అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. జయంతి నేపథ్యంలో జిల్లా వాసులు దివంగత నేత పాలనను మరో మారు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

రైతులకు 'ఉచిత' విద్యుత్

బాపట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.15 కోట్లతో బాపట్ల సమ్మర్ స్టోరేజి ట్యాంకు పరిధిలో ఫిల్టర్ బెడ్లు, పైపులైన్లు నిర్మించారు. బాపట్లతోపాటు తీరప్రాంతంలోని రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో రైతులు ఇసుక నేలల్లో మూడు పంటలు పండించుకుంటున్నారు.

హైలెవల్‌లో చీరాల పరుగులు

చీరాల నియోజకవర్గంలో రూ.120 కోట్లతో చీరాల అభివృద్ధి, రూ.6 కోట్లతో హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించారు. చేనేతల రుణాలు మాఫీచేసి అభయహస్తం అందించారు. వీటితోపాటు చీరాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలోని పలు నియోజకవర్గాలలో సంక్షేమ, అభివృద్ధి పనులుచేపట్టారు.

నేడు జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

పేద జనం గుండెల్లో గూడుకట్టుకున్న దేవుడు దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం జిల్లాలో పెద్దఎత్తున నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. అన్ని నియోజకవర్గాలలో దివంగత నేత విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అన్నదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు.

ఉప్పు రైతులకు అండగా..

పర్చూరు నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించారు. చినగంజాం ప్రాంతంలో అధికంగా ఉన్న ఉప్పు రైతులకు రూ.1.05లకే విద్యుత్ అందించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



ఉప్పు మడుల్లో పనిచేస్తున్న కార్మికులు

అద్దంకిలో అభివృద్ధికి బాటలు

అద్దంకి ప్రాంత అభివృద్ధి కోసం దివంగత వైఎస్ పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. జలయజ్ఞంలో భాగంగా రూ.70 కోట్లతో భవనాశి రిజర్వాయర్, రూ.175 కోట్లతో ఎర్రం చినపోలిరెడ్డి పథకంతోపాటు కొరిశపాడు ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. రూ.1100 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మేదరమెట్ల నుంచి నార్కెట్‌పల్లి వరకూ జాతీయ రహదారిని నిర్మించారు. ఒంగోలు ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు దగ్గర దారిని ఏర్పాటు చేసిన ఘనత దివంగత నేతదే. వీటితోపాటు అద్దంకి నియోజకవర్గంలో అనేక పనులను చేపట్టారు.



ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం

విద్యార్థులకు 'గురుకులం'

వేమూరు నియోజకవర్గం చుండూరులో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. వేమూరు మండలం జంపనిలో షుగర్ ఫ్యాక్టరీని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేయగా దివంగత వైఎస్ దానిని తిరిగి కోఆపరేటివ్ సెక్టార్‌లోకి తీసుక వచ్చారు. ఇవి కాకుండా నియోజకవర్గంలో అనేక పథకాలు అమలు చేశారు.

చుండూరులో ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాల



రేపల్లెకు రాజమార్గం



నిజాంపట్నంలో నిర్మించిన పేదల గృహాలను ప్రారంభిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)

రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో మత్స్యకారులు, ఎస్టీలకు 120 పక్కా గృహాలు నిర్మించారు. రూ.222 కోట్లతో విజయవాడ నుంచి రేపల్లె వరకూ కృష్ణానది పొడవునా కరకట్ట నిర్మించారు.

నిబంధనల మేరకే పొగాకు కొనుగోలు

- ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని రైతుల ఆందోళన
- సమాధానం చెప్పలేక తడబడిన మార్క్‌ఫెడ్ అధికారులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

జే.పంగులూరు: నిబంధనల మేరకే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేస్తామని.. ఇప్పటికి రైతులు వద్ద నుంచి 1000 చెక్కుల వరకు కొనుగోలు చేశామని, గ్రేడుల ప్రకారమే ధర నిర్ణయిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ డీఎం కే కరుణశ్రీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ పీ రమేష్ అన్నారు. మండల పరిధిలోని పంగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేందుకే పంగులూరులో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ అన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రతి ఒక్కరి వద్ద పొగాకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు సహకరించి గ్రేడ్ చేసి పొగాకు చెక్కులు తీసుకొస్తే మంచి ధర పలుకుతుందని తెలిపారు. రైతులు వద్ద నల్లబర్లీ పొగాకు కొనాలంటే తప్పనిసరిగా బేళ్ల వద్ద ఫొటో దిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. అలా చేస్తేనే పొగాకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో షెడ్యూలు అయిన రైతులు వద్ద నుంచి పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పచ్చాకు, బొగులు, నలుపు, డ్యామేజ్ ఉంటే పొగాకు కొనుగోలు చేయమని తెలిపారు. కారణం లేకుండా సీఆర్ చేయడం కుదరదని తెలిపారు. రాబోయే 2, 3 రోజుల్లో తమ్మవరం, మార్టూరు, చినగంజాం గ్రామాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఆందోళన..

అధికారులు రైతుల వద్ద నుంచి వారి ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే చేలో పండించిన పంట, శుభ్రంగా గ్రేడ్ చేసుకొని, చెక్కులు తొక్కుకొని వస్తే వాటిలో కొన్నింటిని మాత్రమే కొని, మిగతా వాటిని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్ చేసుకొని వచ్చిన మంచి రకం పొగాకును కూడా కొనుగోలు చేయడం లేదని రైతులు తెలిపారు. స్పందించిన అధికారులు మాట్లాడుతూ రైతులు తెచ్చిన నల్లబర్లీ చెక్కులు మంచివిగా ఉండి కొనుగోలు చేయకపోతే మా దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు బయ్యర్లను అడగ్గా బాగోలేని చెక్కులు మాత్రమే వెన్క్కు పంపుతున్నట్లు సమాధానం ఇచ్చారు. మాకు కాదు మీరు చెప్పాల్సిందంటూ రైతులకు అని బయ్యర్లపై మండిపడ్డారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మార్క్‌ఫెడ్ మేనేజర్ పి సుబ్రమణ్యం, ఏఓ సుబ్బారెడ్డి, బయ్యర్ శ్రీధర్, ఏఎంసీ సెక్రటరీ కె సుర్యప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ మార్కెటింగ్ కె రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0ను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశాన్ని జయప్రదంగా నిర్వహించడానికి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులకు ముందుగా సమాచారం పంపాలన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు గౌరవప్రదంగా వారిని ఆహ్వానించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,818 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 1,59,108 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థి మిత్ర బహుమానాలను అందుకున్న విద్యార్థులంతా నూతన దుస్తులు ధరించి పాఠశాలకు హాజరు కావాలన్నారు. జూనియర్ కళాశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉంచామని, మంగళవారం నాటికి నర్సరీల నుండి ఆయా మండలాలకు చేరుతాయన్నారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ లో విద్యార్థుల ప్రగతి నివేదిక, హెల్త్ కార్డుల పంపిణీ చేపట్టాలన్నారు. షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులను పిలిపించి వేదికపై మాట్లాడించాలన్నారు. ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఓ పురుషోత్తం, ఏపీసీ నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీపీఓ ప్రభాకరరావు, అటవీశాఖ అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితులపై పెరిగిన దాడులు

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, పేదల పైన దాడులు పెరిగాయని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై టీడీపీ గూండాలు పట్టపగలే కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణం, అమానుషమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి ఈ సంఘటనే నిదర్శనమన్నారు. టీడీపీ మూకలు నాగమల్లేశ్వరరావును కొట్టి తీవ్రంగా గాయపరిచారని, టీడీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత దళితులపైనా, పేద వర్గాలపైనా దాడులు అధికమయ్యాయన్నారు. మొన్న తెనాలిలో దళిత యువకులపై పోలీసులు నడిబజారులో కొట్టిన సంఘటన మరొక ఉదాహరణ అని, రాష్ట్రంలో దళితులంటే తెలుగుదేశం పార్టీకి చిన్న చూపు అని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు భవిష్యత్తులో దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, ఇకనైనా దళితులు, పేదల పై దాడులను మానుకోవాలని లేకుంటే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'నూటా' ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారికి లేఖ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘం(నూటా) ఎన్నికల్లో పారదర్శకత లోపించడం వలన ఈ నెల 9న జరిగే నూటా ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు సోమవారం లేఖ అందజేసినట్లు ఆచార్య కె.సుమంత్ కుమార్(అధ్యక్ష పదవికి పోటీ అభ్యర్థి), ఆచార్య ఎం.జగదీష్ నాయక్(ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ అభ్యర్థి) తెలిపారు. తమకు పోటీగా నిలబడిన అభ్యర్థులు విశ్వవిద్యాలయం పరిపాలన పరమైన పదవుల్లో కొనసాగటం వలన ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుందని, కనుక ఎన్నికల నిర్వహణ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 15 రోజులు పాటు ఎన్నికలను వాయిదా వేయాలని ఈనెల 4, 5 తేదీల్లో ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు వినతి పత్రాలు అందించినా నేటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంతో పాటు తమ లేఖలకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు.

మేరు నగధీరుడు వైఎస్సార్

- నేడు మహానేత వైఎస్సార్ జయంతిని జయప్రదం చేద్దాం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



ఒంగోలు సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలు జీవితకాలం గుర్తుంచుకోదగ్గ మేరు నగధీరుడు అని ఒంగోలు పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. నేడు వైఎస్సార్ 76వ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సోమవారం ఆయన పిలుపునిచ్చారు. బత్తుల మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో పేదవాడి గుండె చప్పుడు పసిగట్టిన దార్శనికుడు వైఎస్సార్ అని అన్నారు. వృత్తిపరంగా వైద్యుడైనా ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను గుర్తించి ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ వైద్యం పేదల దరి చేర్చారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో కార్పొరేట్ విద్య, 108 సేవలు ఆయన వల్లే పురుడు పోసుకున్న విషయాన్ని ఆయన రాజకీయ వైరులు సైతం స్వాగతించారన్నారు. నేడు వీధికి ఒక ఎన్నారై, ప్రతి పేదవాడి ఇంట ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉన్నారంటే అది నాడు వైఎస్సార్ దార్శనికత వల్లే సాధ్యమైందని చెప్పారు. వ్యవసాయాన్ని సంస్కరణల బాట పట్టించి 82 నీటిపారుదల ప్రాజెక్టులను ప్రారంభించి అపర భగీరథునిగా వైఎస్సార్ నిలిచారన్నారు. ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందించి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయాన్ని పండగ చేశారని చెప్పారు. విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.

నరేంద్ర.. నోరు అదుపులో పెట్టుకో!

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



మాట్లాడుతున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ధూళిపాళ్ల నరేంద్ర.. నోరు అదుపులో పెట్టుకో.. మన్నవ గ్రామంలో బొనిగల నాగమల్లేశ్వరరావుపై దారుణంగా దాడి చేసి.. గూండాలు, రౌడీషీటర్లని వ్యాఖ్యానించటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హెచ్చరించారు. 60 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన ఒక దళిత కుటుంబంపై ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గుంటూరు నగరం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం తాను, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కలిసి ఆస్పత్రిలో ఉన్న నాగమల్లేశ్వరరావును చూసి రావటం జరిగిందన్నారు. దళిత కుటుంబానికి చెందిన నాగమల్లేశ్వరరావుపై టీ స్టాల్ వద్ద టీడీపీ నేతలు దాడి చేయడం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఆ కుటుంబానికి చెందిన అమరేంద్రపై కూడా దాడి చేశారని, ఆ కుటుంబాన్ని మట్టుబట్టేందుకు ధూళిపాళ్ల, ఇతర టీడీపీ నేతలు సిద్ధమయ్యారన్నారు. గీత దాటిస్తే భూస్థాపితం చేయండని చెప్పటం.. చంపండి అని చెప్పడం ఒకటేనని దుయ్యబట్టారు. కచ్చితంగా ధూళిపాళ్ల శిక్షార్హులని, ఆయనపై 307 ఐపీసీ కేసు నమోదు చేయాలని, ఏ1గా పెట్టాలని డిమాండ్ చేశారు.

ధూళిపాళ్ల ఆదేశాలతోనే దాడి

– అంబటి మురళీ కృష్ణ

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆదేశాలతోనే నాగేమల్లేశ్వరరావుపై దాడికి తెగబడ్డారని అంబటి మురళీకృష్ణ నిప్పులు చెరిగారు. ఆసుపత్రిలో ఉన్న నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందన్నారు. నాగమల్లేశ్వరరావు ఆరోగ్యంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాకబు చేశారని తెలిపారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పొంతన లేని మాటాలు మాట్లాడుతున్నారన్నారు. నాగమల్లేశ్వరరావు సోదరుడిపై కూడా దాడి చేసినప్పుడు ఆయన ఫిర్యాదు చేస్తే.. తిరిగి అతనిపైనే కేసు నమోదు చేశారన్నారు. కూటమి నేతలకు పోలీసులు, దాసోహమై వ్యవహరిస్తున్నారన్నారు. పొన్నూరు రూరల్ ఎస్ఐ కిరణ్ ఏకపక్షంగా టీడీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారని.. అన్ని రోజులు ఒకేలా ఉండవన్న విషయాన్ని గుర్తించాలని హెచ్చరించారు. చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణచౌదరి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను స్టేషన్‌కు పిలిపించి, గోడ కుర్చీలు వేయించి, ఒక మేడమ్‌కు వీడియో కాల్ చేసి మరీ చూపిస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు నాగమల్లేశ్వరరావు సోదరుడు, ప్రస్తుత ఎంపీటీసీ బొనిగల అమరేంద్ర ప్రసాద్, పార్టీ నేతలు చింతలపూడి మురళీకృష్ణ, షేక్ నాజర్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మీటర్ల ఏర్పాటుపై కూటమి నాయకులను నిలదీయండి

- పిలుపు ఇచ్చిన ప్రజాసంఘాల నాయకులు
- మీటర్ల ఏర్పాటుపై ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిరసన



ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ స్మార్టు మీటర్లపై నిరసన తెలియచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారాన్ని నిలిపివేయాలని, ఈ విషయంపై ప్రజలంతా ప్రజాప్రతినిధులను నిలదీయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన తెలిపారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారానికి రాకముందు గత ప్రభుత్వం అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే అదానితో అనేక ఒప్పందాలు కుదుర్చుకొని ప్రజల నెత్తిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారాన్ని మోపుతూ బలవంతంగా ప్రజలకు అంటగడుతున్నారని, దీనివలన ఇప్పటికే ప్రజలకు అర్థం కాకుండా విద్యుత్ చార్జీలు పెంచి నడ్డి విరిచారని అన్నారు. ఇప్పుడు స్మార్ట్‌మీటర్లు బిగింపు వలన ప్రజలంతా మరింతగా ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఈ మేరకు పోస్టర్లు ప్రదర్శించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇన్‌కం టాక్స్ అధికారి మృతి



జే.పంగులూరు: డివైడర్‌ను ఢీకొని రోడ్డు ప్రమాదంలో ఇన్‌కం టాక్స్ అధికారి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. హైవే పోలీసుల వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన దాసరి కృష్ణచైతన్య (46) గుంటూరులోని ఇన్‌కం టాక్స్ ఆఫీసులో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఒంగోలులోని తన మామయ్య ఇంటి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఒంగోలు నుంచి గుంటూరుకు తన స్కూటీపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై జాగర్లమూడివారిపాలెం వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణచైతన్య తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

ఏడుగురికి తీవ్రగాయాలు



వెంకటరత్నం

మార్టూరు: ఈ మధ్య పిచ్చికుక్కలు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలోని కోలలపూడి గ్రామంలో ఓ పిచ్చికుక్క సోమవారం ఉదయం స్వైర విహారం చేసింది. స్థానిక ఎస్సీ కాలనీలో కనిపించిన వారందరినీ కరుస్తూ మొత్తం ఏడుగురు వ్యక్తులను గాయపరిచింది. గాలి ఏసుకు తల, మొహంపై తీవ్ర గాయాలు కాగా గద్దల సత్యం, దాసరి సుబ్బులు, మురికిపూడి మహేష్, మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. బాధితులను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వ్యాక్సిన్ వేసి చికిత్స అందించారు. తాతా వెంకటరత్నం అనే మహిళ తన ఇంటి ముందు మంచం పై పడుకొని ఉండగా పిచ్చికుక్క ఆమె చెంపలపై నుదుటిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమెను పరిశీలించిన వైద్యులు ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ అవసరం అవుతుందని తెలిపినట్లు బంధువులు తెలిపారు.

రెడ్‌బుక్‌ను కూటమి నేతలు తగులబెట్టాలి

నరసరావుపేట: రాష్ట్రంలో 13 నెలలుగా కొనసాగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగపు రౌడీయిజానికి 1161 మంది గురై వారి భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడిన నేపథ్యంలో, ఎట్టకేలకు హైకోర్టు స్పందించి రిమాండ్ విధించే ముందు మేజిస్ట్రేట్లు నిబంధనలను గట్టిగా పాటించాలని ఆదేశించడం హర్షణీయమని సోషల్ యాక్టివిస్టు ఈదరగోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అరాచక పాలన చేసిన కూటమి నేతలు, పోలీసులకు ఈ ఆదేశాలు చెంపపెట్టు లాంటివని అన్నారు. ఈ ముఖ్యమైన అంశంపై సోషల్ మీడియా యాక్టివిస్ట్ హరీశ్వరరెడ్డి చొరవ తీసుకుని హైకోర్టులో పిటిషన్ వేయడం అభినందనీయమని అన్నారు. ఇంతటితో ఆగకుండా ఇప్పటికే పెట్టిన 1161 కేసులను సమీక్షించి నిర్దోషులను కేసుల నుంచి తప్పించేందుకు పోలీసు వేధింపులు, హింసకు గురైన వారికి ఊరట కల్పించి, నష్టపరిహారం ఇప్పించేందుకు, చట్టవిరుద్ధంగా వ్యవహరించిన మేజిస్ట్రేట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సిట్టింగ్ జడ్జితో ఒక ప్రత్యేక విచారణ కమిటీని హైకోర్టు నియమించేలా పోరాటం కొనసాగించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఇకనైనా బుద్ధి తెచ్చు కుని, పశ్చాత్తాపం చెంది రెడ్‌బుక్‌ని నడిరోడ్డులో తగల పెట్టాలని డిమాండ్ చేశారు.

మంచి యూనిట్లు ఎంపిక చేసుకొని ఆదాయం పెంచుకోండి

నరసరావుపేట: ప్రతిఒక్కరూ మంచి యూనిట్లను ఎంపిక చేసుకొని వాటి ద్వారా కుటుంబానికి ఆదాయం పెంచుకునేలా కృషిచేయాలని అధికారులు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పీఎంఇజీపి, పీఎంఎఫ్ఎంఎఫ్ రుణాలపై బ్యాంకర్లచే లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని డీఆర్‌డీఎం పీడీ ఝాన్సీరాణి మాట్లాడారు. లబ్ధిదారులకు కావలసిన శిక్షణ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మార్కెటింగ్ చేసేందుకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లైన అమెజాన్, ఫ్లిఫ్‌కార్ట్ వంటి వాటి ద్వారా వీలు కల్పించడం జరుగుతుందని అన్నారు. హార్టీకల్చర్ జిల్లా అధికారి ఐ.వెంకటరావు మాట్లాడుతూ డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేసుకొని తర్వాత కొటేషన్, ఆధార్, పాన్‌కార్డు సిద్ధం చేసి సంబంధిత అధికారికి అందజేసిన తర్వాత లాగిన్‌లో అప్‌డేట్‌చేసి వాటిని అప్రూవల్ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో కూడిన యూనిట్లను ఎంచుకొని వాటిపై లబ్ధిదారులు లబ్ధిపొందేలా చేయడమే కలెక్టర్ అరుణ్‌బాబు ఆలోచన అన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాంప్రసాద్, డీపీఎం డేవిడ్, శ్రీనివాస్, యూనియన్ బ్యాంకు, సీజీజీబి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పోలీస్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 55 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తి తగాదాలు, స్థల వివాదాలు ఇతర పలు సమస్యలపై వచ్చిన ప్రజల అభ్యర్థనలను ఎస్పీ కూలంకషంగా విని, అర్జీలను పరిశీలించాలని సూచించారు. సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీదారుల సమస్యలను త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవవహరిస్తూ, వారి సమస్యలను నిర్దేశిత గడువులోనే సంతృప్తికర రీతిలో పరిష్కరించాలన్నారు. పునరావృత అర్జీలు రాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని స్పష్టం చేశారు. అర్జీలను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, చీరాల డీఎస్పీ మొయిన్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మృతి



మృతి చెందిన ఆర్మీ జవాన్ రవికుమార్ (ఫైల్)

నగరం: ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి నగరం మండలం చిరకాలవారిపాలెం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఉప్పాల రవికుమార్ (24) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చిరకాలవారిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల ఇమ్మానుయేలు, లక్ష్మి దంపతుల ద్వితీయ కుమారుడు రవికుమార్ నాలుగేళ్ల కిందట ఆర్మీలో జవాన్‌గా చేరాడు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ ఇటీవల వివాహం నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. బంధువుల కుమార్తెతో నిశ్చితార్థం చేసుకుని వివాహానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో ఆపరేషన్ సిందూర్ విధుల్లోకి హాజరుకావాలని ఆర్మీ నుంచి ఆదేశాలు రావటంతో విధుల్లోకి వెళ్లాడు. త్వరలోనే వివాహ ముహూర్తాన్ని ఖరారు చేసుకుని స్వగ్రామానికి వచ్చి వివాహం చేసుకోవాల్సిన కుమారుడు రవికుమార్ గత శనివారం జమ్మూకశ్మీర్‌లోని రాజౌరిలో విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి అక్కడిక్కడే మృతి చెందాడు. రవికుమార్ భౌతికకాయం మంగళవారం స్వగ్రామమైన చిరకాలవారిపాలెం గ్రామానికి రానుంది. రవికుమార్ అకాల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పట్టణంలో వైద్యురాలి ఇంట భారీ చోరీ

సుమారు రూ.13 లక్షలు అపహరణ



దుండగులు వస్తువుల్ని తీయడంతో ఖాళీ అయిన బీరువా

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని వైద్యురాలి ఇంటిలో గుర్తు తెలియని దుండగులు భారీ చోరీ చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక పురుషోత్తమపట్నంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఇమ్మడి రాణి సంయుక్త సుమారు రెండేళ్లుగా శారద హైస్కూల్ రోడ్డులో నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం విధులు ముగించుకుని కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఉంటున్న అన్నయ్య వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి ప్రధాన ద్వారం తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా, దాని పక్కనే మరోవైపు ఉన్న తలుపు తెరిచి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూసింది. గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గ్రహించింది. బీరువా తెరిచి ఇంట్లో అంతా చిందర వందరంగా వస్తువులు, దుస్తులు పడి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని సందర్శించి పోలీసులు వివరాలు సేకరించారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాల సేకరించారు. ఇంట్లోని 70 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు, కేజీన్నర వెండి వస్తువులు, పట్టు చీరెలు అపహరణకు గురయ్యాయని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ పి రమేష్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి



మృతుడు మల్లికార్జునరావు



తిరగబడిన ట్రాక్టరు

సంతమాగులూరు(అద్దంకి): ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. జే పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన నల్లపాటి మల్లికార్జునరావు(41) తన ట్రాక్టరును నడుపుకుంటూ సంతమాగులూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెల్లలచెరువు గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే గోతుల రోడ్డు కావడంతో బ్రేక్ వేయగా అదుపు తప్పి తిరగబడింది. ఈ ఘటనలో మల్లికార్జునరావు పైనుంచి కిందపడగానే ట్రాక్టరు టైరు తలపైకి ఎక్కింది. రక్తగాయం ఆవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. భర్త మృతితో భార్య, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడి మామ తేలప్రోలు ఆంజనేయులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఐ యేట్ ఇండియా'

- ముగిసిన రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ఇదే నాటికకు మరో నాలుగు బహుమతులు



ఉత్తమ ప్రదర్శన బహుమతిని స్వీకరిస్తున్న విజయవాడ సమాజం బాధ్యులు

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మూడురోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. న్యూస్టార్ మోడ్రన్ థియేటర్స్, విజయవాడ వారు ప్రదర్శించిన 'ఐ యేట్ ఇండియా' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. మరో నాలుగు బహుమతులను అందుకుంది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకత్వం (డాక్టర్ ఎం.ఎస్.చౌదరి), ఉత్తమ ఆహార్యం (దినేష్), ఉత్తమ రంగాలంకరణ (దివాకర ఫణీంద్ర), జ్యూరీ బహుమతి (లోహిత్) సహా మొత్తం ఐదు బహుమతులు లభించాయి.

- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి, విశాఖపట్నం వారి 'ఖరీదైన జైళ్లు' నాటిక ఎంపికైంది. ఇదే నాటిక ఉత్తమ నటి (శోభారాణి), ఉత్తమ క్యారెక్టర్ నటి (నాగరాణి), బహుమతులను అందుకుంది. తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక దక్కించుకుంది. ఇదే నాటికకు ఉత్తమ రచన (పీటీ మాధవ్), ఈ నాటికలో నటించిన పి.వరప్రసాద్ ఉత్తమ నటుడు బహుమతిని, డి.హేమ ఉత్తమ ప్రతినాయకురాలు బహుమతులను గెలుచుకున్నారు.
- ఇతర ప్రదర్శనల్లో 'అ సత్యం' నాటికకు ఉత్తమ సంగీతం (పి.లీలామోహన్), ఆ నాటికలో నటించిన పి.రామారావుకు ఉత్తమ క్యారెక్టర్ నటుడు బహుమతి లభించాయి. 'వీడేం మగాడండీ బాబూ' నాటికలో నటించిన జీఎస్ చలపతికి ఉత్తమ హాస్యనటుడు బహుమతి లభించాయి. 'అనుకున్నదొకటి అయినదొకటి' నాటికలో పిల్ల బిచ్చగాడు పాత్రధారి రుత్విక్‌కు జ్యూరీ బహుమతి వచ్చింది. న్యాయనిర్ణేతలుగా చెరుకుమల్లి సింగారావు, వి.హైమావతి, గోపరాజు విజయ్ వ్యవహరించారు. పోటీల అనంతరం ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజేతలకు బహుమతులను అందజేశారు. సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, డీఎల్ కాంతారావు పాల్గొన్నారు. తొలుత పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలతో చివరిరోజు కార్యక్రమాలను ఆరంభించారు. తెలుగు కళాసమితి, విశాఖపట్నంవారి 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచనకు చలసాని కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. చివరగా చైతన్య కళాభారతి, కరీంనగర్‌వారి 'ఖరీదైన జైళ్లు' నాటికను ప్రదర్శించారు. పి.వెంకటేశ్వరరావు మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. నిర్వాహక సంస్థల బాధ్యులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకట నారాయణ, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు పర్యవేక్షించారు.